# సంబురాల వేళ.. ఆనందోత్సాహం

## సందడిగా నమస్తే తెలంగాణ దసరా షాపింగ్ బొనాంజా



అమీర్‌పేట్, అక్టోబర్ 6: దసరా పండుగ సీజన్ కావడంతో అటు షాపింగ్ సెంటర్లు ఇస్తుండే రిబేట్లు ఒక వైపు, 'నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే' దిన పత్రికల సమర్పణలో కొనసాగుతున్న దసరా షాపింగ్ బొనాంజాలో ప్రతి రోజు గెలుచుకుంటున్న లక్కీ డ్రా ద్వారా అందివస్తున్న బహుమతులు కొనుగోలుదారులకు డబుల్ ధమాకాగా మారాయి. ఎంపిక చేసిన ఔట్‌లెట్లలో షాపింగ్ చేస్తున్న కొనుగోలుదారులు తమకు అందిన కూపన్లు డ్రాప్ బాక్సుల్లో వేసేందుకు ఉత్సాహాన్ని చూపిస్తున్నారు. 'నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే' దిన పత్రికల సమర్పణలో కొనసాగుతున్న దసరా షాపింగ్ బొనాంజా ఐదో లక్కీ డ్రా ఆదివారం అమీర్‌పేట్‌లోని కేఎల్ఎమ్ ఫ్యాషన్ మాల్‌లో కస్టమర్ల సమక్షంలో ఉత్సాహంగా సాగింది. ఈ లక్కీ డ్రాను కేఎల్ఎమ్ ఫ్యాషన్ మాల్ సోర్సింగ్ ఇన్‌ఛార్జ్ వి.మహేష్ బాబు, నమస్తే తెలంగాణ ప్రకటనల విభాగం ఏజీఎం పి.రాములు, డిప్యూటీ మేనేజర్ సందీప్ జోషిలు నిర్వహించారు.

### లక్కీ డ్రా విజేతలు వీరే..

అమీర్‌పేట్ కేఎల్ఎమ్ ఫ్యాషన్ మాల్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన లక్కీ డ్రాలో విజేతల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఛర్మాస్‌లో షాపింగ్ చేసిన కె.కవిత మొదటి బహుమతిగా టీవీని గెలుచుకోగా, ద్వితీయ బహుమతిగా స్మార్ట్ ఫోన్‌ను అమీర్‌పేట్ కేఎల్ఎం ఫ్యాషన్ మాల్‌లో షాపింగ్ చేసిన జె.రాజు, మూడో బహుమతిగా గిఫ్ట్ వోచర్‌ను ఛర్మాస్‌లో షాపింగ్ చేసిన సలోని గెలుచుకున్నారు. లక్కీ డ్రాలో బహుమతులు గెలుపొందిన విజేతలకు త్వరలోనే వారికి వచ్చిన గిఫ్ట్‌లను అందజేయడం జరుగుతుంది.

### కొనుగోలుదారుల నుంచి అనూహ్య స్పందన



పదేళ్లుగా నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే దినపత్రికల సమర్పణలో కొనసాగుతున్న దసరా షాపింగ్ బొనాంజాలో కొనుగోలుదారుల నుంచి అనూహ్య స్పందన వ్యక్తమవుతోంది. తొమ్మిది రోజుల పాటు కొనసాగే లక్కీ డ్రాలో ఆదివారం ఐదో రోజు డ్రా తీశారు. పాఠకులే కాక కొనుగోలుదారులు కూడా లక్కీ డ్రా పట్ల ఆసక్తిని కనబరుస్తున్నారు. పండుగ రోజుల్లో ప్రతి రోజు 'నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే' దిన పత్రికలు సమర్పిస్తున్న దసరా బొనాంజా అందిస్తున్న బహుమతులు గెలుచుకుంటున్న విజేతలకు శుభాకాంక్షలు. అత్యంత పారదర్శకంగా ప్రకటనలదారుల వద్ద డ్రాను నిర్వహిస్తున్నాం.

*– పి.రాములు, ఏజీఎం, ప్రకటనల విభాగం, నమస్తే తెలంగాణ*

### పండుగ ఆనందం ద్విగుణీకృతం



'నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే' దిన పత్రికలు సమర్పిస్తున్న దసరా బొనాంజాలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉంది. నగరంలో ఉన్న అన్ని ఔట్‌లెట్లతో పాటు కేఎల్ఎమ్ ఫ్యాషన్ మాల్‌కు చెందిన అన్ని ఔట్‌లెట్లలో లక్కీ డ్రాలో పాల్గొంటున్న కొనుగోలుదారుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. కేఎల్ఎమ్‌లో కొనుగోలు చేస్తున్న కొనుగోలుదారులు నేరుగా తాము అందిస్తున్న రిబేట్లే కాకుండా నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే దిన పత్రికల ద్వారా అందుతున్న బహుమతులు కొనుగోలుదారులకు పండుగ ఆనందాన్ని ద్విగుణీకృతం చేస్తోంది.

*– వి.మహేష్ బాబు, సోర్సింగ్ ఇన్‌ఛార్జ్, కేఎల్ఎమ్ ఫ్యాషన్ మాల్ అమీర్‌పేట్*

# శ్రీలక్ష్మి నీ మహిమలు.. గౌరమ్మ









"శ్రీలక్ష్మి నీ మహిమలూ.. గౌరమ్మ చిత్రమై తోచునమ్మా.. భారతీదేవివై.. బ్రహ్మకిల్లాలువై.. పార్వతీదేవివై పరమేశ్వరరాణివై పరగ శ్రీలక్ష్మివై గౌరమ్మ.. భార్యవైతివి హరికినీ..." అంటూ నగరంలో పలు చోట్ల బాలికలు, యువతులు, మహిళలు అనేకం ఒకచోట చేరి బతుకమ్మ పండుగను అంగరంగ వైభవంగా జరుపుకుంటున్నారు. తొమ్మిది రోజుల బతుకమ్మ వేడుకలో ఆదివారం ఐదో రోజు కావడంతో అట్ల బతుకమ్మను మహిళలు భక్తిశ్రద్ధలతో పార్వతీదేవిని స్తుతిస్తూ, భక్తి పూర్వక గానాలాపనతో కోలాట మాడారు. ఆదివారం గోధుమ అట్లు లేదా బియ్యపు పిండితో చేసిన అట్లను అమ్మవారికి నైవేద్యంగా పెట్టారు. తమ బతుకులను తీర్చిదిద్దాలని ప్రతి మహిళ ఆ లక్ష్మీదేవిని వేడుకున్నారు.









# అవంతిలో సంప్రదాయంగా బతుకమ్మ వేడుక



బతుకమ్మలు ఆడుతున్న అవంతి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు

కాచిగూడ, అక్టోబర్ 6: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ వేడుకలు ప్రతీకగా నిలుస్తాయని అవంతి విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ ఎం.ప్రియాంక అన్నారు. బర్కత్‌పుర అవంతి డిగ్రీ, పీజీ కళాశాలల ఆధ్వర్యంలో అట్ల బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో సహజ సిద్ధంగా తయారు చేసిన బతుకమ్మ వేడుకలను విద్యార్థినులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అవంతి విద్యా సంస్థల హెచ్చార్ డాక్టర్ వై.జయప్రద, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ పరిశీలనలో జాప్యం




మేడ్చల్, అక్టోబర్6(నమస్తే తెలంగాణ): ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన పర్యవేక్షణ లోపంతో నత్తనడకన నడుస్తుందన్న ఆరోపణలు వివిపిస్తున్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో మొత్తంగా లక్షా 73 వేల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయి. 40 బృందాలు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన చేస్తున్నప్పటికి అధికారులు పట్టించుకోవడం లేదని తెలుపుతున్నారు. డిసెంబర్ చివరి వారం వరకు దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలని ప్రభుత్వం చెప్పడంతో ఇప్పటి వరకు 3,502 దరఖాస్తుల పరిశీలనను మాత్రమే పూర్తి చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలోని 13 మున్సిపాలిటీల పరిధిలోని దరఖాస్తులను రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపాలిటీ శాఖలు సంయుక్తంగా పరిశీలిస్తుండగా పంచాయతీల పరిధిలోని దరఖాస్తుల పరిశీలన హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. జీహెచ్ఎంసీ సర్కిళ్ల పరిధిలోని దరఖాస్తులను జీహెచ్ఎంసీ చూస్తుందని అధికారులు వెల్లడిస్తున్నారు. దరఖాస్తుల పరిశీలన వేగవంతంగా చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికి అంతంత మాత్రంగానే సాగుతున్నట్లు తెలుస్తుంది.

### హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు..

దరఖాస్తులకు సంబంధించి అనుమానాలను నివృత్తి చేసుకునేలా జిల్లా వ్యాప్తంగా హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశారు. గతంలో సమర్పించిన దరఖాస్తుల్లో సరైన పత్రాలు సమర్పించనట్లయితే తిరిగి చేర్చేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 13 మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలోని దరఖాస్తులు జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాధిగా గుప్తా పర్యవేక్షణలో సాగుతున్నాయి.

# అగ్రి వర్సిటీలో 14 నుంచి కౌన్సెలింగ్

వ్యవసాయ యూనివర్సిటీ, అక్టోబర్ 5 : ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండాలక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం, పీవీ నర్సింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం బీఎస్సీ (హన్స్), అగ్రికల్చర్ బీఎస్సీ, కమ్యూనిటీ సైన్స్, బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ బ్యాచ్‌లర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, అనిమల్ హస్బెండరీ బీవీఎస్సీ అండ్ఏహెచ్, 2024-25 విద్యాసంవత్సరానికి గాను మొదటి సంవత్సరం కౌన్సెలింగ్ ఈనెల 14 నుంచి 19వరకు నిర్వహించనున్నట్లు వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి తెలిపారు. ఇందుకుగాను టీజీ ఎప్‌సెట్ 2024 అర్హత పొంది ఆన్‌లైన్‌లో అప్లై చేసిన వారు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.

# పండుగ వేళ.. వండర్ ఆఫర్లు

సిటీబ్యూరో, అక్టోబర్ 6(నమస్తే తెలంగాణ): దసరా నేపథ్యంలో నగరవాసులు వండర్ లాలో కుటుంబ సమేతంగా గడిపేందుకు ప్రత్యేక ఆఫర్లను అమలు చేస్తున్నామని వండర్ హాలీడేస్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ కె.చిట్టిలపల్లి తెలిపారు. దేశ వ్యాప్తంగా ఎమ్యూజ్‌మెంట్ పార్కులను నిర్వహిస్తున్న వండర్ లా హైదరాబాద్‌లోని పార్కులో కొత్త రైడ్స్‌ను అందుబాటులోకి తీసుకురావడం, దీంతో పాటు ప్రత్యేక ఆఫర్లను ప్రవేశపెట్టామన్నారు. ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకున్న వారికి 2 టిక్కెట్లు కొంటే ఒక టిక్కెట్‌ను ఉచితంగా ఇస్తున్నామని, ఈ ఆఫర్ ఈ నెల 13వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. దీంతో పాటు వండర్ లా పార్కులోకి వచ్చిన తర్వాత రెండు ఫుడ్ కాంబో టిక్కెట్లు కొంటే ఒక టిక్కెట్‌ను ఉచితంగా ఇస్తున్నామని ప్రకటించారు. కుటుంబాలు, స్నేహితులంతా కలిసి సరదాగా రోజంతా గడిపేందుకు వండర్ లాలో ప్రత్యేకమైన రైడ్స్ ఉన్నాయి.

# ఉత్సాహంగా గ్రేస్ క్యాన్సర్ రన్






గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ అధ్వర్యంలో ''రన్ ఫర్ గ్రేస్-స్క్రీన్ ఫర్ లైఫ్'' అనే థీమ్‌తో గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం ''గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్-2024'' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందుకు ముఖ్య అతిథిగా రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి, అనంతరం, విజేతలకు బహుమతులు అందజేశారు. క్యాన్సర్ వ్యాధిని ముందస్తు పరీక్షలతో ప్రారంభ దశలోనే గుర్తిస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని, క్యాన్సర్ మహమ్మారిని కట్టడి చేసే వీలుంటుందని మంత్రి అన్నారు. అంతకు ముందు యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, గివ్ లైఫ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బార్డ్ ఫీషర్ 10కే, 5కే, 2కే రన్‌లను జెండా ఊపి ప్రారంభించారు. నగరంతో పాటు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 20 వేల మంది ఈ రన్‌లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పురుషుల, మహిళల కేటగిరీల్లో విజేతలైన వారికి ఈ సందర్భంగా మంత్రి చేతుల మీదుగా బహుమతులు, మెడల్స్ అందజేశారు.

*– శేరి లింగంపల్లి, అక్టోబర్ 6*

# లంగ్స్ క్యాన్సర్‌ను గుర్తిస్తే ముప్పు తప్పినట్లే



సిటీబ్యూరో, అక్టోబర్ 6(నమస్తే తెలంగాణ) : ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి, సరైన చికిత్స విధానాలను పాటిస్తే ప్రాణహాని తప్పుతుందని పలువురు పల్మోనాలజిస్టులు తెలిపారు. హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్‌లో నోడ్యూల్ సమ్మిట్-2024 ఇంటర్నేషన్ కాన్ఫరెన్స్, లైవ్ వర్క్ షాప్ పేరిట అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. వైద్యులు డా. నాగార్జున మాటూరు నేతృత్వంలో పల్మనరీ మెడిసిన్ విభాగం ఈ సదస్సును నిర్వహించగా.. ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులు, రోగ నిర్ధారణ, చికిత్స విధానాలు, నోడ్యూల్స్ నిర్వహణపై అవగాహన కల్పించేలా ఈ సదస్సును జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన యశోద గ్రూప్ హాస్పిటల్ డైరెక్టర్ డా. పవన్ గోరుకంటి సదస్సును ప్రారంభించారు. డా.నాగార్జున మాటూరు మాట్లాడుతూ 'దేశంలో ఊపిరితిత్తుల వ్యాధులు, లంగ్స్ క్యాన్సర్, క్షయ, న్యూమోనియా వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారన్నారు. క్యాన్సర్ సంబంధిత మరణాలలో లంగ్స్ క్యాన్సర్ మూడో స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో డా. మషాహిదే ఓకీ(జపాన్), డాక్టర్ కైల్ హోగార్త్ (అమెరికా), డా. యౌన్ మింగ్ సాయ్(తైవాన్), డాక్టర్ లిన్ షెంగ్ హావో(తైవాన్), డా. ఎరిక్ డేనియల్ టెండా(ఇండోనేషియా) హాజరయ్యారు.



# ఘనంగా మాతా విశాల్ జాగరణ్

అబిడ్స్, అక్టోబర్ 6: ధూల్‌పేట్ నవరాత్రి ఉత్సవ సమితి 16వ వార్షికోత్సవ మాతా రాణికా విశాల్ జాగరణ్ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. సమితి చైర్మన్ శ్రీధర్ బాబు, వైస్ చైర్మన్ సత్యనారాయణ్, అధ్యక్షుడు జితేందర్‌సింగ్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, కోశాధికారి నిమేశ్‌సింగ్ ఆధ్వర్యంలో రహీంపురా ప్లే గ్రౌండ్స్‌లో అయోధ్య రామ మందిరం తరహాలో ఏర్పాటు చేసిన సెట్ పలువురిని ఆకట్టుకుంది.

# భౌగోళిక వైవిధ్యాన్ని పరిరక్షించాలి

మణికొండ, అక్టోబర్ 6: భౌగోళిక వైవిధ్యాన్ని పరిరక్షించకపోతే పర్యావరణాన్ని కాపాడలేమని దక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ వేదకుమార్ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ జియో డైవర్సిటీ-2024 డేను పురస్కరించుకొని దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ఆధ్వర్యంలో జియో హెరిటేజ్ ట్రయల్, టాక్ ఆన్ జియో డైవర్సిటీని నిర్వహించారు. ఫక్రుద్దీన్‌గుట్ట(ఖాజా హిల్స్)లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి దక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ వేదకుమార్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ఇతర స్వచ్ఛంద సంస్థలతో కలిసి 2022 నుంచి అంతర్జాతీయ జియో డైవర్సిటీ డేను నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణలోని జియో హెరిటేజ్ సైట్లపై అవగాహన కల్పించేందుకు ఈ సంవత్సరం ఫక్రుద్దీన్ గుట్టను సందర్శించామని తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ మహేందర్‌రెడ్డి, కొత్త తెలంగాణ చరిత్ర బృందం రామోజు హరగోపాల్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చక్కిలం వేణుగోపాలరావు, సోమరామ్మూర్తి, ఎ.ఆర్.రామ్‌రాజ్, సకీనా, జనాబ్ జాజిర్ హుస్సేన్, వేముగంటి మురళీకృష్ణ, శోభాసింగ్, ఎస్.ఎస్.ప్రసాద్, పర్యాటక శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ వై.సుభాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఖాజా హిల్స్ వద్ద అంతర్జాతీయ జియో డైవర్సిటీ-2024లో పాల్గొన్న ట్రస్ట్ సభ్యులు